నేడు జీహెచ్ఎంసీ ప్రజావాణి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం (నేడు) ప్రజావాణి ఉంటుందని కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. ఉదయం 10:30 నుంచి 1:30 గంటల వరకు ఫోన్ ఇన్ ప్రోగ్రామ్ 040-2322 2182 నంబర్‌కు సమస్యలను విన్నవించవచ్చని తెలిపారు. ఈ ప్రజావాణి జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో కూడా జరుగుతుందని పేర్కొన్నారు.

27న సుశీలమ్మకు మెలోడి ఆఫ్‌ది మ్యూజిక్ అవార్డు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 25 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, శృతిలయ ఆర్ట్స్ అకాడమి – సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27 రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో గానకోకిల సుశీలమ్మకు మెలోడి ఆఫ్‌ది క్యూన్ మ్యూజిక్ అవార్డు బహూకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీల్‌వెల్ సీఎండీ బండారు సుబ్బారావు, శృతిలయ చైర్మన్ బొక్క భీంరెడ్డి, శృతిలయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ మంత్రి సీతక్క, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

28న వేల్యాండ్ యూనివర్సిటీ స్పాట్ అడ్మిషన్లు

బేగంపేట్, ఫిబ్రవరి 25 : ఈ నెల 28న అమెరికాలోని వేల్యాండ్ బాప్టిస్ట్ యూనివర్సిటీలో వివిధ కోర్సులకు సంబంధించిన స్పాట్ అడ్మిషన్లు అమీర్‌పేట్‌లోని ఆదిత్య హోటల్‌లో 28న ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 638714 9133 సంప్రదించాలని కోరారు.

సీటు బెల్టు ప్రాణాలు నిలుపు..!

- చిన్న తాడే కదా అని.. లైట్ తీసుకోకండి!
- ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి
- రోడ్డెక్కితే.. గమ్యం చేరేవరకు అప్రమత్తత అవసరం
- సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తున్న సోషల్ ఆర్గనైజేషన్స్
- వాహన భద్రత, డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు

సీటు బెల్ట్ తప్పనిసరి

సీటు బెల్ట్‌ను మోసం చేస్తే అది మన ఆయుష్షునే ఆపేస్తుంది. సీటు బెల్ట్ పెట్టుకోవడం మన బాధ్యత. అందుకే మేం సెల్ఫీ విత్ సీట్ బెల్ట్ అనే ప్రచారం చేస్తున్నాం. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా యువత అతివేగంతో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. వారిని కంట్రోల్ చేయాల్సిన బాధ్యత పేరెంట్స్ తీసుకోవాలి.

– షేక్ సలావుద్దీన్, సెల్ఫీ విత్ సీట్ బెల్ట్ ప్రచార కర్త

టైర్ల గ్రిప్ చెక్‌చేసుకోవాలి

కారు మోడల్‌ను బట్టి టైర్లు.. వాటి పరిమాణాన్ని బట్టి ఎయిర్ ఫిలప్ చేయాల్సి ఉంటుంది. సాధారణంగా 32 పాయింట్లతో గాలి నింపితే సరిపోతుంది. కారు ఎక్కువగా వాడే వారు నిర్వహణపై మరింత శ్రద్ధ వహించాలి. ఎక్కువగా వినియోగించని వాళ్లు కనీసం పది నుంచి 15 నిమిషాలు కారును స్టార్ట్ చేసి ఉంచాలి. దీనివల్ల టైర్లు డ్యామేజీ అవకుండా ఉంటాయి. ఇలా నెలకు రెండుసార్లు అయిన చేయాలి. టైర్లు నాణ్యతగా ఉంటే అతివేగంలో ఉన్నా వెహికిల్‌ను కంట్రోల్ చేయగలం.

– నాయుడు, మారుతీ షోరూం

ఈ క్షణం వరకే మనం సేఫ్..

కండ్లు మూసి తెరిస్తే.. ఏం జరుగుతుందో తెలియదు.. మృత్యువు ఏ మలుపు నుంచి ముంచుకొస్తుందో.. ఎటువైపు నుంచి దూసుకువస్తుందో తెలియదు.. మన ప్రయాణం ఎప్పుడు ముగుస్తుందో తెలియదు.. కానీ సీటు బెల్టు పెట్టుకుంటే ప్రాణాలు నిలబెట్టుకోవచ్చని తెలిసినా.. చాలా మంది ఆ పనిని అంతులేని నిర్లక్ష్యంగా ప్రదర్శిస్తుంటారు. ఇంటి పెద్ద దిక్కు ప్రాణాలు గాల్లో కలిసి.. వారి కుటుంబాన్ని మొత్తం అనాథలుగా మారుస్తారు. అందుకే రోడ్డెక్కామంటే.. గమ్యం చేరేవరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిందే.. ముఖ్యంగా సీటుబెల్టు పెట్టుకోవాల్సిందే. చిన్న బెల్టు మీ ప్రాణాలను కాపాడటంతో పాటు.. మీ కుటుంబం రోడ్డున పడకుండా ఆపుతుందని మర్చిపోవద్దు.

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : రోడ్డు ప్రమాదాలకు అతివేగం, నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. మరోవైపు వాహనాలు ఫిట్‌నెస్‌గా లేకపోవడం కూడా ప్రమాదాలకు దారి తీస్తుంది. కొందరు నిబంధనలకు విరుద్ధంగా డ్రైవ్ చేస్తూ ఇతర వాహనదారుల ప్రాణాలతోనూ చెలగాటమాడుతున్నారు. అంతేకాకుండా వారి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సురక్షిత డ్రైవింగ్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండేల ట్రాక్స్ ఎస్ సొసైటీ, క్యాబ్ అసోసియేషన్ సంస్థలు కృషి చేస్తున్నాయి. సెల్ఫీ విత్ సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించండి తదితర స్లోగన్స్‌తో సోషల్ మీడియాలో సైతం అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు వాహన పనితీరులో చాలా ముఖ్యమైన టైరు పరిస్థితిపై డ్రైవర్లకు అవగాహన ఉండాలని సూచిస్తున్నారు. కారు టైరు ఎందుకు పేలుతుంది.? టైరులో గాలి ఎంత ఉండాలి? ఎయిర్ ప్రజర్ లోపం ఉంటే ఏమవుతుంది? టైర్ల నాణ్యత ఎలా తెలుసుకోవాలి? సీటు బెల్ట్ పెట్టకపోతే? బెలూన్స్ పనితీరు ఎలా ఉంటుంది? తదితర వాటిపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

చక్రాలు సాఫీగా తిరగాల్సిందే...!!

- ఏ వాహనానికైనా చక్రాలు అత్యంత ముఖ్యం. అంతటి ప్రాధాన్యతగల చక్రాలపై వాహనదారులకు అవగాహన అవసరమని మెకానిక్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.
- టైరు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. చాలా మంది టైర్లు గ్రిప్‌ను కోల్పోతున్నా నిర్లక్ష్యంతో వాహనాన్ని అలానే నడుపుతుంటారు. ప్రమాదాలకు అధిక కారణం టైర్లు బాగలేకపోవడమే.
- టైర్లల్లో సరిఫడా గాలి ఉండేల చూసుకోవాలి. 14 ఇంచుల టైరులో 29, 15 ఇంచుల టైరులో 30, 16 అయితే 36 ఎయిర్ పాయింట్లతో గాలి ఫిల్ చేయించుకోవాలి.
- కారును ఎక్కువగా వినియోగించకపోతే టైర్లు హార్ట్‌గా మారే ప్రమాదం ఉంది. ఆ సమయంలో అధిక వేగంతో ప్రయాణం చేసినప్పుడు టైరు కదలికల్లో మార్పు వస్తుంది. రోడ్డుపై మేకులు, బండలు ఉన్నప్పుడు లేదా బ్రేకులు వేయడానికి ప్రయత్నించిన సమయంలో ఒక్కసారిగా కారు టైరు బ్లాస్ట్ అయ్యే ప్రమాదం ఉంది.
- వాహనదారులు ఇష్టారీతిన డ్రైవ్ చేయడం కూడా ప్రమాదమే. ముఖ్యంగా సడెన్ బ్రేకులు ఎక్కువసార్లు వేయడం, స్పోర్ట్స్ వాహనాల మాదిరిగా వీల్స్‌ను ఎక్కువసార్లు అటు ఇటూ తిప్పడం కూడా టైర్ నాణ్యతపై ప్రభావం చూపుతుంది.
- ప్రతి 5 వేల కిలో మీటర్లకు ఒక్కసారి తప్పనిసరిగా వీల్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలి.
- 40వేల కిలో మీటర్లను తప్పనిసరిగా కొత్త టైర్లను అమర్చుకోవాలి.
- టైర్లను కొనుగోలు చేసే సమయంలో నూతన తేదీల తయారీనే ఎంచుకోవాలి.
- టైర్లు సక్రమంగా లేకపోయినా ఒక్కోసారి బ్రేకులు పడవు. అందుకే టైర్ల గ్రిప్‌లపై కూడా దృష్టి సారించాలి. టైరుపై 2 ఎంఎం ట్రేడ్ ఉండాలని మెకానిక్‌లు సూచిస్తున్నారు.

సీటుబెల్ట్‌ను మోసం చేయొద్దు..!

కారెక్కగానే సీటు బెల్టు ధరించాలి. లేకుంటే ప్రమాదాలు జరిగినప్పుడు ఒక్కోసారి ప్రాణాలే పోతాయి. అందుకే సీటు బెల్టు పెట్టుకోకపోతే అలారం మోగి మరీ హెచ్చరించే సాంకేతిక పరిజ్ఞానాన్ని కార్లలో అమర్చాయి వాహన తయారీ సంస్థలు. కొన్నింటిలో అయితే ఇంజిన్ కూడా స్టార్ట్ అవ్వదు. మన భద్రత కోసమే ఇదంతా.. కానీ కొందరు సీటు బెల్టు పెట్టుకోవడాన్ని నామోషిగా భావిస్తున్నారు. సౌండ్ రాకుండా మార్కెట్‌లో దొరుకుతున్న చీటర్ అనే పరికరాన్యని సీటు బెల్ట్ బకెల్‌కి అమర్చుతారు. సీటు బెల్ట్ బకెల్‌ను లాక్‌లో పెట్టకుండా ఈ పరికరంలో అమరిస్తే హెచ్చరికల బజర్ మోగదు. కారు యాక్ససరీలు అమ్మే అన్ని దుఖానాల్లో ఇవి అందుబాటులో ఉన్నాయి. అయితే బకెల్ అమర్చి.. అలారంను మనం మోసం చేస్తే అది మన జీవితాన్ని లేకుండా చేస్తుందని గుర్తుంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

పీవీ సేవలు మరువలేనివి : ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

బోడుప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు

బోడుప్పల్, ఫిబ్రవరి 25 : దేశానికి మాజీ ప్రధాని, స్వర్గీయ పీవీ నర్సింహారావు సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ. నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ప్రకటించిన సందర్భంగా బోడుప్పల్‌లోని బ్రాహ్మణ భవన్‌లో అఖిల బ్రాహ్మణ వికాస సమితి ఆధ్వర్యంలో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ దేశ ఔనత్యానికి, సమగ్రతకు కృషి చేసిన పీవీకి భారతరత్న అవార్డు రావడం సంతోషకరమైన విషయమని తెలిపారు. ఈ అవార్డుతో ఆయన ఖ్యాతి మరింత పెరిగిందని, ఆయన చూపిన మార్గంలో నడుచుకుని దేశ సేవకు నడుంబిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వేణుగోపాల చారి, కార్పొరేటర్ భూక్య సుమన్, అఖిల బ్రాహ్మణ వికాస సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి నందకుమార్ జోషి, ప్రభాకర్ రావు, సుబ్బాష్, సుధాకిరణ్, జగన్మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజశేఖర్

నూతన కమిటీ సభ్యులు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 25 : జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎస్.రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా డి.శ్రీనివాస్ రెడ్డి, పి.మహేశ్వర్ రావు, జి.ఇందిరా షీలారాణి, ప్రధాన కార్యదర్శిగా వి.వినోద్ భార్గవ తదితరులు ఎన్నికయ్యారు.

మక్కా మసీద్‌లో ..'షబ్ ఏ బరాత్' ప్రార్థనలు

షబ్ ఏ బరాత్‌ను పురస్కరించుకొని ఆదివారం మక్కా మసీద్‌లో వందలాదిమంది ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మక్కా మసీద్ పరిసరాలు సందడిగా మారాయి.

గరికపాటికి ప్రవచన పరమహంస బిరుదు

గరికపాటిని సన్మానించి ప్రవచన పరమహంస బిరుదును ప్రదానం చేస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి తదితరులు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 25 : తమ ప్రవచనాలతో సమాజ శ్రేయస్సు కోసం డాక్టర్ గరికపాటి నరసింహారావు చేస్తున్న కృషి అత్యంత ప్రశంసనీయమని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఆదివారం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గరికపాటి 'స్వపరివర్తనతో.. విశ్వ పరివర్తన' అనే అంశంపై ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి గరికపాటి దంపతులను ఘనంగా సన్మానించి ప్రవచన పరమహంస బిరుదును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అధ్యక్షుడు గౌరీ శెట్టి మునీర్‌ధర్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కోశాధికారి కొత్త వెంకటేశ్వర రావు, ఆకృతి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ రచయితల వేదిక 8వ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్, అందెశ్రీ, సుదర్శన్‌రెడ్డి తదితరులు

టీఎంసీ నూతన కమిటీ వైద్యులకు సన్మానం

నూతన టీఎంసీ సభ్యులను సన్మానించిన హెచ్ఆర్‌డీఏ

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 25 : హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ) ఆధ్వర్యంలో 25వ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఇటీవల జరిగిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో హెచ్ఆర్‌డీఏ మద్దతుతో గెలిచిన 13 మంది ప్యానెల్ సభ్యులను, హెచ్ఆర్‌డీఏ సభ్యులైన 150 మంది వైద్యులను ఆదివారం సికింద్రాబాద్ గాంధీ వైద్య కళాశాల అలుమ్ని సెమినార్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి నిమ్స్ నెఫ్రాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ శ్రీభూషన్ రాజు, నిమ్స్ సిటీ సర్జరీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ అంబరీశ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌డీఏ చైర్మన్ డాక్టర్ మహేశ్ కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాస్, సభ్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ నరేశ్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ సన్నీ డెవిస్, 250 మంది సభ్యులు పాల్గొన్నారు.

సైకాలజిస్టు కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో సైకాలజిస్ట్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ కోరారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన గ్రేటర్ సైకాలజిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో మనోధైర్యం నింపడంతో పాటు పరీక్షల ఒత్తిడిని తగ్గించి వారికి మానసిక ప్రశాంతతను అందించేందుకు సైకాలజిస్టుల సేవలు ఎంతో అవసరమన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, నగర అధ్యక్షురాలు డాక్టర్ షర్మిల, నాయకులు శ్రీపూజ, అలియా ఫర్వీన్ , శ్రీదేది, ఉమర్‌ఖాన్, విజయరాణి, డాక్టర్ లావణ్య, అనిత పాల్గొన్నారు.

నేడు కిసాన్ మోర్చా ట్రాక్టర్ ర్యాలీలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 25 : డబ్ల్యూటీఓ నుంచి భారత్ బయటికి రావాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ట్రాక్టర్, వాహన ర్యాలీలు నిర్వహించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా, ప్రజా, కార్మిక సంఘాల నేతలు తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా కన్వీనర్ టి.సాగర్, వి.ప్రభాకర్, పల్లపు ఉపేందర్‌రెడ్డి, వెంకట్‌రాములు, గౌని ఐలయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

శాటిలైట్ షిప్‌లో.. ఏఐ సిటీ

- ఓఆర్ఆర్ చెంతనే 50-100 ఎకరాల్లో.. ఏర్పాటుకు ఐటీ శాఖ సన్నాహాలు
- భవిష్యత్ ఏఐ ఆధారిత ప్రాజెక్టులకు కేంద్రంగా రూపకల్పన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ).. యావత్ ప్రపంచాన్ని కొత్త పంథాలో నడిపిస్తున్నది. ఏఐలో గత ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి విప్లవాత్మక మార్పులకు దారితీస్తున్నది. ఏడాది క్రితం చాట్ జీపీటీ రాకతో అన్ని రంగాల్లోనూ ఏఐ తప్పనిసరిని అన్నట్లుగా మారిపోయింది. భవిష్యత్తు అంతా మనుషులతో సమానంగా యంత్రాలు పనిచేయడమే కాదు.. ఆలోచించడం, రోజు వారి కార్యకలాపాలు నిర్వహించే స్థాయికి ఏఐ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్నది. ఈ విషయాన్ని గుర్తించిన గత కేసీఆర్ ప్రభుత్వంలో ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్ తెలంగాణ ఏఐ మిషన్‌ను (టీ–ఎయిమ్)ను ఏర్పాటు చేసి ఆ రంగంలో సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీ శాఖ ఆధ్వర్యంలో ఏఐ కోసం ప్రత్యేకంగా ఒక నగరాన్నే ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలోనే ప్రకటించింది. దానికి సంబంధించిన ప్రాథమిక ఏర్పాట్లను ఐటీ శాఖ వడివడిగా చేపడుతున్నది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ మహానగర అభివృద్ధిపై మాట్లాడుతూ ఔటర్ రింగు రోడ్డు బయట టౌన్‌షిప్పుల నిర్మాణం చేపడతామని ప్రకటించారు. అలా ఏర్పాటు చేసే శాటిలైట్ టౌన్‌షిప్‌లలో ఒకదానిని పూర్తిగా ఏఐ సిటీగా తీర్చిదిద్దేలా ఐటీ శాఖ సన్నాహాలు మొదలు పెట్టింది. ఒకే చోట 50–100 ఎకరాల స్థలం తీసుకొని అక్కడ ఏఐతో ప్రారంభించే స్టార్టప్‌లు, కంపెనీలకు అవసరమైన మౌలిక వసతులను, నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఒకే చోట ఏర్పాటు చేయనున్నామని ఐటీ శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. ఇదే సంవత్సరం జూలైలో 1, 2 తేదీల్లో హైదరాబాద్ వేదికగా ఏఐ సమ్మిట్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తంగా ఏఐ టెక్నాలజీతో రూపొందించే ప్రాజెక్టులకు ఏఐ సిటీ కేంద్ర బిందువుగా మారనున్నది. కాగా ప్రస్తుతం ఉన్న ఐటీ కారిడార్ పరిధిలో కాకుండా ఓఆర్ఆర్ బయట ప్రత్యేకంగా నిర్మించే శాటిలైట్ షిప్‌లో ఉండేలా ఏఐ సిటీకి రూపకల్పన చేస్తున్నారు.

త్రిపుర గవర్నర్‌కు సన్మానం

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి, రేణుక దంపతులను సన్మానిస్తున్న రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి, తదితరులు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 25 : రెడ్డి హాస్టల్‌లో తాను సభ్యుడిగా ఉన్నందుకు ఎంతో గర్వంగా ఉన్నదని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రాసేనా రెడ్డి అన్నారు. ఆదివారం అబిడ్స్‌లోని రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్డి హాస్టల్ ఆడిటోరియంలో రెడ్డి హాస్టల్ జీవిత కాల సభ్యుడు, త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రాసేనా రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీవీఆర్ఆర్ సొసైటీ కార్యవర్గం గవర్నర్ నల్లు ఇంద్రాసేనా రెడ్డి, రేణుక దంపతులకు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. అంతకు ముందు మాజీ అడిషనల్ ఎస్‌పీ, రచయిత పెద్దిరెడ్డి తిరుపతి రెడ్డి రచించిన 'ఆదర్శ పథంలో పోలీసుల సమగ్ర పరిశీలన' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎం.వెంకటరంగారెడ్డి, కార్యదర్శి తీగల మోహన్‌రెడ్డి, జాతీయ సాహిత్య పరిషత్ భాగ్యనగర్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షుడి సుకన్యారెడ్డి, సహ కార్యదర్శి వాసుదేవా రెడ్డి, కోశాధికారి కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ జి.గోపాల్‌రెడ్డి, జనప్రియ రవీందర్‌రెడ్డి, డాక్టర్ నందకుమార్ రెడ్డి, రెడ్డి జన సంఘం అబిడ్స్ సలహాదారుడు ప్రొఫెసర్ కంచర్ల దశరథ్‌రెడ్డి, వేమిరెడ్డి నర్సింహారెడ్డి, టామ్‌కాం మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగల పంతం.. బీజేపీ అంతం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 : మాదిగలకు రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాదిగ జేఏసీ అధ్యక్షుడు పిడమర్తి రవి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 'మాదిగల పంతం.. బీజేపీ అంతం.' పేరుతో నిర్వహిస్తున్న మాదిగల జోడో యాత్ర ఆదివారం శంషాబాద్‌కు చేరుకున్నది. శంషాబాద్ పట్టణంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుంటి ప్రవీణ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పిడమర్తి రవి మాట్లాడుతూ మాదిగలకు రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తూ కేవలం పెట్టుబడి దారులకు కొమ్ముకాస్తున్నదని తెలిపారు. రాముడి పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీకి ఓట్ల ద్వారా తగ్గిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అన్ని పార్టీలు పార్లమెంట్ ఎన్నికలలో మాదిగలకు 2 ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకట్, రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య, ముత్యపాగం నరసింహారావు, సురేశ్, ఎండీ నజూరుద్దీన్, శ్రీధర్, అక్రమాన్, మల్లికార్జున్, నాని, దిత్య, రమేశ్, గణేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌కు చేరుకున్న మాదిగల జోడో యాత్రలో మాట్లాడుతున్న పిడమర్తి రవి, గుంటి ప్రవీణ్, తదితరులు

నూతక్కికి మాడభూషి పురస్కారం

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 25 : మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారం–2023 ప్రముఖ రచయిత్రి ఉమా నూతక్కి రచించిన '25వ గంటల' కథా సంపుటి పుస్తకానికి వరించింది. ఈ మేరకు ఆదివారం కోఠిలోని శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలో మాడభూషి రంగాచార్య స్మారక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్మారక పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కథా నవల రచయిత శ్రీధర, సభాధ్యక్షురాలు శీలా సుభద్రదేవి, సంఘం కన్వీనర్ మాడభూషి లలితాదేవిలతో కలిసి ఉమా నూతక్కి కుమారుడు ప్రవీణ్, కుమార్తె మేఘనలకు పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం ప్రముఖ కథా రచయితలు కామేశ్వరి, ఇంద్రగంటి జానకి బాల, పరిమళ సోమేశ్వర్ రచించిన 'మన కథలు' నాల్గవ సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సాహిత్య పరిషత్ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి, సుధామ పాల్గొన్నారు.

నిమ్స్‌లో నర్సుల నియామకం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : నిమ్స్‌లో నర్సుల నియామకం చేపట్టనున్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలకు 30,261 మంది దరఖాస్తు చేసుకోగా ఒప్పంద ప్రాతిపదికన 300 మందిని ఎంపిక చేశారు. కాగా ఆయా అభ్యర్థులు సోమవారం నుంచి మార్చి 4 వరకు విధుల్లో చేరవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు.

నగరంలో నేడు..

- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రెస్‌మీట్.
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు కుమ్మర (షాలివాహన) రాజకీయ నాయకుల ఆత్మీయ సమ్మేళనం.
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 2గంటలకు ఆలిండియా ఎస్‌సీ, ఎస్‌టీ ఐక్యవేదిక క్యాలెండర్ ఆవిష్కరణ.